# రైతుల సందేహాలు నివృత్తి చేయాలి

- మొదటి విడత 47,978 మంది రైతులకు రుణమాఫీ
- వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

రామాయంపేట: బ్యాంకులో రుణమాఫీ గురించి రైతులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

రామాయంపేట: అమ్మ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, (నమస్తే తెలంగాణ)/ రామాయంపేట, జూలై 25: రామాయంపేట మండలంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా పట్టణంలోని ఏపీజీవీబీని సందర్శించి, పంట రుణమాఫీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో అనుసంధానంగా ఉంటున్న వ్యవసాయశాఖ అధికారి రాజ్‌నారాయణ, బ్యాంకు సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ ప్రక్రియను బ్యాంకు, వ్యవసాయశాఖ సిబ్బంది వేగవంతంగా కొనసాగిస్తున్నారన్నారు. జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో లక్షలోపు పంట రుణమాఫీకి రూ.238.81కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జిల్లాలోని రైతులు 47, 978 మందికి పంట రుణమాఫీ చేసిందన్నారు. సాంకేతిక కారణాలతో కొంతమంది రైతుల రుణమాఫీ బ్యాంకుల్లో జమ కాలేదన్నారు.

**ప్రజారోగ్య రక్షణకే వైద్య శిబిరాలు: జిల్లా వైద్యాధికారి శ్రీరాం**

ప్రజారోగ్య రక్షణకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని వైద్యాధికారి శ్రీరాంలు అన్నారు. సుతారిపల్లిలో వైద్య శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్, డీఎంహెచ్‌వో మాట్లాడారు. సీజనల్ వ్యాధులతో సతమతమవుతున్న గ్రామస్తులకు వైద్య శిబిరాలతో మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. వ్యాధులు ఎదుర్కోవడానికే వైద్య సిబ్బందిని సమాయత్తం చేస్తున్నామన్నారు. ఆరోగ్య రక్షణకే వైద్య శిబిరాలు పని చేస్తాయన్నారు. ఇంటింటా సర్వేల ద్వారా జ్వర పీడితులను గుర్తించి చికిత్సలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో వ్యక్తిగత పరిశుభ్రత, నీటి నిల్వలపై సారిస్తున్నట్లు తెలిపారు.

**అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

వర్షాకాలంలో జిల్లాలో విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని, విద్యుత్ సరఫరాలో ఏదైనా సమస్యలుంటే త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు అంటువ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలను ఆరోగ్య విషయంలో చైతన్యవంతం చేయాలని అధికారులకు సూచించారు. గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందించాలని, గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులందరికీ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, వైద్యాధికారి శ్రీరామ్, రామాయంపేట సీహెచ్‌సీ వైద్యుడు లింబాద్రి, డి.ధర్మారం వైద్యురాలు హరిప్రియ, వ్యవసాయశాఖ అధికారి రాజ్‌నారాయణ, బ్యాంకు మేనేజర్ నందకిశోర్ సుతారిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రాగి సంధ్య, ఉమామహేశ్వర్ ఉన్నారు.

తాగునీటి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

## కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా

**- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు**

మెదక్ మున్సిపాలిటీ, జూలై 25: డబుల్ బెడ్‌రూమ్ కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పిల్లికొటాల్ డబుల్ బెడ్‌రూమ్ కాలానీలో ఆకామ్ సంస్థ (ఆటోమెటిక్ క్లోరినేషన్ ఆన్‌లైన్ మానిటరింగ్), మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కాలనీల్లో త్వరలోనే సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు. ఇంకా పూర్తి కాని ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కమినషర్ జానకీరామ్‌సాగర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, కౌన్సిలర్లు మధుసూదన్‌రావు, లింగం, శేఖర్, లక్ష్మీనారాయణగౌడ్, గంగాధర్, ఆకామ్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి: ఆర్డీవో

ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

పాపన్నపేట, జూలై 25: ఏడుపాయల్లో తరచూ నీటి ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని మెదక్ ఆర్డీవో రమాదేవి ఆదేశించారు. గురువారం ఏడుపాయల్లోని మంజీరా నది తీరంలో ప్రమాదాలు జరిగే స్థలాన్ని తహసీల్దార్ లక్ష్మణ్‌బాబుతో కలిసి పరిశీలించారు. తరచూ ప్రమాదాలు జరిగే స్థలంలో రక్షణ చర్యలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ఘనపూర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

## పునరావాస కేంద్రానికి వృద్ధురాలు

వృద్ధురాలిని పునరావాస కేంద్రానికి తరలిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట, జూలై 25: గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన గృహాలను గుర్తించి అందులో నివసిస్తున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని తహసీల్దార్ మన్నన్ ఆదేశించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని జంగరాయిలో వృద్ధురాలు భారతమ్మ నివాస గృహం గురువారం పాక్షికంగా కూలిపోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఆ గృహాన్ని పరిశీలించారు. గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక పునరావాస కేంద్రానికి వృద్ధురాలిని తరలించారు. బియ్యం అందించాలని డీలర్ మోహన్‌కు, నిత్యవసర సరుకులు అందించాలని పంచాయతీ కార్యదర్శి భానుకుమార్‌కు తహసీల్దార్ సూచించారు.

## బీజేపీ విస్తృత స్థాయి సమావేశం

నర్సాపూర్, జూలై 25: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అధ్యక్షతన గురువారం పట్టణ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేశ్‌గౌడ్ హాజరై భవిష్యత్ కార్యాచరణ, పార్టీ కార్యక్రమాల గురించి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో రమణారావు, రాజేందర్, బుచ్చేశ్‌యాదవ్, సురేశ్, యాదగిరి, రమేశ్ యాదవ్, నీలి నాగేశ్, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేడు మెదక్‌లో నీటి సరఫరా బంద్

మెదక్ మున్సిపాలిటీ, జూలై 25: మెదక్‌లో శుక్రవారం మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జానకీ రామ్‌సాగర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగూర్ ప్రాజెక్ట్ వద్ద విద్యుత్తు మోటర్లు చెడిపోయినందున సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నందున ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## రేపు ఎస్‌జీఎఫ్ సమావేశం

మెదక్ మున్సిపాలిటీ, జూలై 25: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డీఈవో ఆదేశాల మేరకు ఈ నెల 27న ఎస్‌జీఎఫ్ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాల క్రీడల కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలకు 1.30 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లాలో క్రీడల నిర్వహణ, రాష్ట్రస్థాయిలో నిర్వహించే క్రీడల ఎంపికపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. డీఈవో రాధాకిషన్ హాజరవుతున్నారని, జిల్లాలోని పీడీలు, పీఈటీలు హాజరు కావాలని కోరారు.

## రెండు ఆటోలు ఢీకొని ఒకరికి గాయాలు

కౌడిపల్లి, జూలై 25: రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన కౌడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. కుటుంబీకుల కథనం ప్రకారం.. అంతారం గ్రామానికి చెందిన గొల్ల రవి కౌడిపల్లికి పాల ఆటో తీసుకుని రోజు వెళ్తుంటాడు. ఇదే క్రమంలో రోజు మాదిరిగానే కౌడిపల్లి వచ్చి వెళ్తున్న క్రమంలో ధర్మాసాగర్‌కు చెందిన ఆటో హైదరాబాద్ నుంచి ఎదురుగా వస్తున్న మరో ఆటో బలంగా ఢీకొట్టింది. దీంతో అంతారానికి చెందిన గొల్లరవికి తీవ్రగాయాలు అయ్యాయి. అనంతరం 108 అంబులెన్సులో దవాఖానకు తరలించారు.

## ఉర్దూలో సైన్ బోర్డులు ఉండాలి

మెదక్ అర్బన్, జూలై 25: బస్సు రూట్లలో సైన్ బోర్డులు కేవలం తెలుగులో ఉన్నందున ముస్లిం, మైనారిటీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టీయూడబ్ల్యూజే యూ నాయకులు మహమ్మద్ ఇంతియాజుద్దీన్, మహమ్మద్ యూసుఫ్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు.

## యువకుడు అదృశ్యం

శివ్వంపేట, జూలై 25: యువకుడు అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన యువకుడు చెన్నాపూర్ నవీన్ ఈనెల 24న ఉదయం గ్రామశివారులోని పొలం వద్దకు వెళ్లి బర్రెలు కొట్టుకొస్తానని తండ్రికి చెప్పి వెళ్లాడు. సాయంత్రం తండ్రి ఇంటికొచ్చి చూడగా ఇంటివద్ద నవీన్ లేడు. దీంతో తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో నవీన్ తండ్రి యాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**బాధిత కుటుంబానికి ఆర్థికసాయం**

శివ్వంపేట, జూలై 25: కొంతాన్‌పల్లి గ్రామంలో పెద్దపల్లి లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి గురువారం పరామర్శించి, సొంతంగా రూ.5 వేలు, సొసైటీ నుంచి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WATER PROOFING
★ Roof & Wall Crack Filling, Water Proofing Coatings, New & Old Bhathrooms Leakages, Water Tank & Sump Leakages, Rain Coat & Pest Control, Slab & Beems Injection Work, 10 years Waranty. Call: 9010425273, 8121425273.
NT-326124
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

కౌడిపల్లి, నర్సాపూర్ పోలీస్టేషన్లలో రికార్డులు చూస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

నర్సాపూర్/కౌడిపల్లి, జూలై 25: ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా చూడాలని సిబ్బందికి ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచించారు. నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డితో కలిసి నర్సాపూర్, కౌడిపల్లి, చిలిపిచెడ్ ఎస్సైలతో క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఇన్వెస్టిగేషన్ గురించి పలు సూచనలు చేస్తూ లాండ్ ఆర్డర్ పటిష్టత గురించి వివరించారు.

**కౌడిపల్లిలో..**

కౌడిపల్లి పోలీస్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్టేషన్ పరిసరాలను తిరిగి పరిశీలించారు. ఆయనతో నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై పుష్పరాజ్, కౌడిపల్లి ఎస్సై రంజిత్‌కుమార్, చిలిపిచెడ్ ఎస్సై షేక్ మహబూబ్ ఉన్నారు.

## బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

చేగుంట, జూలై 25: బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కును ఇబ్రహీంపూర్ మాజీ సర్పంచ్ రాములు గురువారం అందజేశారు. మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన వంటిబాయ్‌కాడి కుమార్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దవాఖాన ఖర్చుల కోసం దుబ్బాక ఎమెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డికి విజ్ఞప్తి పంపాడు. వారి సహకారంతో మంజూరైన రూ.60వేల చెక్కును గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నీల స్వామి, ముప్పిడి మల్లేశం, బెదరబోయిన కిరణ్, గొల్ల మల్లేశం, గుర్రాల సురేశ్ తదితరులున్నారు.

## చండూర్‌లో దొంగల బీభత్సం

చండూరులో దొంగతనం చేసిన ఇంటిని పరిశీలిస్తున్న నర్సాపూర్ సీఐ, ఎస్సై

చిలిపిచెడ్, జూలై 25: అర్ధరాత్రి ఇండ్లలో దొంగలు బీభత్సం సృష్టించిన ఘటన చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చండూర్ గ్రామంలో గురువారం జరిగింది. ఎస్సై షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. చండూర్‌లో గొట్టమీది యాదమ్మ, వనం నిగమ్మ, లక్ష్మి ఇండ్లలోని బీరువాల్లో దుస్తులు, వెండి, నగదు చోరీ జరిగింది. పాతూరి యాదగిరికి చెందిన ఆరు గొర్రెలు, ఆంజనేయులుకు చెందిన ద్విచక్రవాహన చక్రం దొంగలించారు. విషయం తెలుసుకున్న నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల దగ్గర వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చోరీకి పాల్పడిన వ్యక్తి రిమాండ్

బానోత్ బర్మ్‌సింగ్

శివ్వంపేట, జూలై 25: మండలంలోని చండిగ్రామంలో ఎల్లమ్మదేవి హుండీలోని నగదు చోరీ చేసిన వ్యక్తిని రిమాండ్ చేసినట్లు ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎస్సై మాట్లాడుతూ మంగళవారం అర్ధరాత్రి ఎల్లమ్మగుడి తలుపులు పగలగొట్టి హుండీలోని డబ్బులు దొంగలించాడని గ్రామానికి చెందిన నల్లవల్లి కృష్ణ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. దర్యాప్తులో చోరీకి పాల్పడిన దుండగుడు దుండిగల్‌కు చెందిన బానోత్ బర్మ్‌సింగ్‌గా గుర్తించి, రిమాండ్‌కు పంపించామని ఎస్సై తెలిపారు.

## పత్రాలు లేని బైక్‌లు స్వాధీనం

వెల్దుర్తి, జూలై 25: పత్రాలు లేని, దొంగ బైక్‌లు విక్రయిస్తున్నారన్న సమాచారంతో మూడు రోజుల నుంచి వెల్దుర్తిలోని బైక్‌షోరూముల్లో తనిఖీలు చేస్తున్నారు. గురువారం పత్రాలు లేని నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నవత తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అనుమతులు, పత్రాలు లేకుండా, దొంగ బైక్‌లు కొన్నారని, విక్రయిస్తున్నారన్న సమాచారంతో వెల్దుర్తిలోని శ్రీలక్ష్మీ, నాగా, తిరుమల మోటార్స్‌లో తనిఖీలు చేపట్టారు. శ్రీలక్ష్మీ మోటార్స్‌లో మూడు, తిరుమల మోటర్స్‌లో ఒక బైక్ ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

## పోషకాహారంతోనే ఆరోగ్యం

సామూహిక సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీలు

మెదక్‌రూరల్, జూలై 25: మండలంలోని ఖాజీపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఆర్యోగంపై అవగాహన కల్పించారు. గురువారం పోషకాహారం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం, సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషకాహార లోపం ఉన్న గర్భిణులు, బాలింతలు సంతులిత ఆహారం తీసుకోవాలని సూచించారు.

ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

## మీసేవ కేంద్రాల్లో అదనపు రుసుం వసూలు చేయొద్దు

**- అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు**

అల్లాదుర్గం, జూలై 25: జిల్లాలోని మీసేవ కేంద్రాల్లో ఈఎస్‌డీ గైడ్లైన్స్ ప్రకారం ప్రజల వద్ద అధిక రుసుం వసూలు చేయవద్దని అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. టెక్మాల్‌లోని తహసీల్, ఎంపీడీవో కార్యాలయాలు, మీసేవ కేంద్రాలను గురువారం తనిఖీచేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎస్‌డీ ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ విధానం ద్వారా ప్రజలందరూ డిజిటల్ పేమెంట్స్ చేయాలన్నారు. దీంతో ఎలాంటి అదనపు రుసుం చెల్లించకుండా ఉపయోగపడుతుందన్నారు. మీసేవ నిర్వాహకులు రెవెన్యూ సర్వీసులకు సంబంధించి సరియైన పత్రాలు మాత్రమే జతపర్చాలని, లేదంటే తిరిగి మీ లాగిన్‌లోకి వస్తాయని తెలిపారు. మీసేవ సెంటర్లలో అదనపు రుసుం తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మీసేవ జిల్లా మేనేజర్ శశికాంత్, ఈడీఎం సందీప్, ఎంపీడీవో రియాజోద్దిన్, తహసీల్దార్ కృష్ణ ఉన్నారు.

## వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

పోచమ్మ ఆలయం వద్ద గజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న కాలనీవాసులు

నర్సాపూర్, జూలై 25: నర్సాపూర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో ధ్వజస్తంభాన్ని గురువారం ప్రతిష్ఠించారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 29న అంబేద్కర్ కాలనీలోని పోచమ్మ ఆలయంలో బోనాలు సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భిక్షపతి, సర్వేశ్, చంద్రయ్య, బబ్బురి కృష్ణ, జలంధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం

రామాయంపేట, జూలై 25: ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని టీఎన్‌జీవో రామాయంపేట అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. గురువారం టీఎన్‌జీవో ఉప కోషాధికారిగా నాగరాణిని నియమించారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

# రుణమాఫీ రాకుంటే దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి గోవింద్
- రుణమాఫీపై సందేహాలు నివృత్తి చేసుకోవాలి
- మెదక్ వ్యవసాయ సహాయ సంచాలకులు విజయనిర్మల

శివ్వంపేట: గోమారం ఏపీజీవీబీలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోవింద్



రామాయంపేటలో పాస్‌బుక్కుల అందజేస్తున్న తహసీల్దార్ రజనీకుమారి

శివ్వంపేట, జూలై 25: ప్రభుత్వం రైతులకు మాఫీ చేసిన పంట రుణమాఫీపై ఎవరికైనా సందేహాలుంటే వారి నుంచి దరఖాస్తులు తీసుకోవాలని ఏఈవో లావణ్యకు డీఏవో గోవింద్ సూచించారు. గురువారం గోమారం గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకును సందర్శించి, రుణమాఫీ వివరాలను బ్యాంకు మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. మొదటి విడతలో 820 మంది రైతులకు రూ.4.49కోట్ల మాఫీ అయ్యిందన్నారు. రుణమాఫీ డబ్బులు పంట పెట్టుబడి కోసం వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం శివ్వంపేట రైతు వేదికలో అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓలు మౌనిక, మాజీద్ అలీ, భవాని, రవి, తదితరులు పాల్గొన్నారు.

**రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి**

మెదక్ రూరల్, జూలై 25: పంట రుణ మాఫీపై రైతులకు ఏమైనా సందేహాలుంటే వ్యవసాయ శాఖ అధికారులను కలిసి నివృత్తి చేసుకోవాలని మెదక్ వ్యవసాయ సహాయ సంచాలకులు విజయనిర్మల తెలిపారు. గురువారం మెదక్‌లోని కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతులు రైతు వేదికలో పట్టా పాసుబుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుబుక్ జిరాక్స్‌లను అధికారికి అందజేయాలన్నారు. కొత్తగా పట్టాపాస్‌బుక్ వచ్చిన రైతులు రైతుబీమా కోసం ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేకోవాలని ఏడీ తెలిపారు.

**రైతులకు పాస్‌బుక్కులు అందజేత**

రామాయంపేట, జూలై 25: మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన రైతులకు గురువారం పాసుబుక్కుల అందజేసినట్లు తహసీల్దార్ రజనీకుమారి పేర్కొన్నారు. 433 సర్వే నెంబర్‌లో భూమిని ప్రభుత్వం గుర్తించి పట్టాలు అందజేసినట్లు తెలిపారు. కోనాపూర్ సొసైటీ చైర్మన్ కరికె విజయలక్ష్మి, డైరెక్టర్లు మామిడి సిద్ధరాములు, రాములు, విద్యాసాగర్ ఉన్నారు.

# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నిజాంపేట: గొరువెచ్చని నీటిని తాగాలని గ్రామస్తులకు సూచనలిస్తున్న ఎంపీడీవో రాజిరెడ్డి

చిలిపిచెడ్: మాట్లాడుతున్న ఎంపీవో శరత్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి తిరుపతి

నిజాంపేట, జూలై 25: వర్షాకాలంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రాజిరెడ్డి సూచించారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా గురువారం వెంకటపూర్(కె) గ్రామాన్ని ఎంపీడీవో సందర్శించారు. సీజనల్ వ్యాధులు ప్రబలడానికి అవకాశం ఉన్నదని, నివారణకు నీటి నిల్వలు తొలిగించాలని, గోరువెచ్చని నీటిని తాగాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి, పంచాయతీ కార్యదర్శి ప్రేమ ఉన్నారు.

**మరుగుదొడ్లను వినియోగించుకోవాలి**

చిలిపిచెడ్, జూలై 25: ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలని ఎంపీవో శరత్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని చిట్కుల్ గ్రామంలో గ్రామ కార్యదర్శి తిరుపతి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీలో మరుగుదొడ్ల సదుపాయం ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం, మురుగు నిల్వలు, ప్లాస్టిక్ వ్యర్థాల డంప్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

**వివేకానంద పాఠశాలలో వైద్యశిబిరం**

రామాయంపేట, జూలై 25: స్థానిక వివేకానంద పాఠశాలలో సన్‌రిచ్ దవాఖాన వైద్యులు వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు పరీక్షలు చేశారు. విద్యార్థులు ఎక్కువ శాతం దృష్టి లోపం, పోషాకాహార లోపంతో సీజనల్ వ్యాధులకు గురవుతారన్నారు. 500 మందికి చికిత్స చేసినట్లు తెలిపారు. శిబిరంలో పిల్లల వైద్యులు డాక్టర్ చరణ్, హెచ్‌ఎం.రామ్‌కుమార్ ఉన్నారు.